క్లుప్తంగా

28 నుంచి తలుపులమ్మ అమ్మవారి జాతర


తలుపులమ్మ అమ్మవారు


అమ్మవారికి సమర్పించిన గరగ

తాళ్లరేవు: పటవల గ్రామ దేవత తలుపులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త చెక్కా అజయ్ వర్మ తెలిపారు. జాతీయ రహదారి సమీపంలోని ఆలయంలో 28న జాతర, 29న తీర్థ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా 30న ఏకాహ మహోత్సవం, అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. మహోత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన కొప్పాడి మీరాసాయిబు, కనకమహాలక్ష్మి దంపతులు అమ్మవారికి నూతన గరగను సమర్పించారు. ఈ సందర్భంగా గరగకు ప్రత్యేక పూజలు చేశారు.

వివాహ ఆర్థిక సాయం బ్యాంకు ఖాతాల్లో జమ

ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గంలో బీపీఎల్ దిగువన ఉన్న కుటుంబాల్లోని యువతుల వివాహానికి ఇచ్చే ఆర్థికసాయం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 495 మంది వధువులు వివాహం కోసం ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. అలాగే తండ్రి మృతిచెంది, తల్లి ఉన్న యువతుల వివాహం కోసం 127 మంది 2018 నుంచి దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అవి పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఆయా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంతో, ఆ మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నట్లు చెప్పారు. ఇకపై ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే మొత్తం రూ.7 లక్షలకు పెంచినట్టు సీఎం రంగసామి అసెంబ్లీలో ప్రకటించారని తెలిపారు.

చేపల వర్తకులకు రుణాలు

యానాం: నియోజకవర్గ పరిధిలో మత్స్యకార సొసైటీల్లో సభ్యత్వం ఉన్న వారికి చేపల వర్తకం కోసం యానాం పుదువై భారతీయార్ బ్యాంక్ ద్వారా కేసీసీ రుణాలు ఇస్తున్నట్లు మంగళవారం మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దడాల గొంతియ్య ఓ ప్రకటనలో తెలిపారు. పుదువై బ్యాంకు అకౌంట్ కలిగిన వారికి రూ.20 వేల వరకు రుణ సదుపాయం కల్పిస్తారని చెప్పారు.

త్వరలో టీచర్ల పర్మినెంట్!

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా 2021 నుంచి గౌరవ వేతనంపై వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లను త్వరలో పర్మినెంట్ చేస్తామని, వారికి నిర్దీత వేతనం ఇస్తామని విద్యా శాఖ మంత్రి నమశ్శివాయం తెలిపారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా 2021లో 84 మంది గెస్ట్ టీచర్ల నియామకం జరిగిందన్నారు. అదేవిధంగా 288 మంది కాంట్రాక్టు టీచర్లుగా ఉన్నారన్నారు. వీరి విధులను పర్మినెంట్ చేసేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎం చర్చించనున్నారన్నారు. దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

రీ సర్వేతో భూములకు సరిహద్దులు

అల్లవరం: రీ సర్వే ద్వారా గ్రామాల్లోని ప్రభుత్వ, రైతుల భూములకు సరిహద్దులు నిర్ణయించి, ఎల్‌పీఎం నంబర్ జారీ చేస్తారని ఆర్డీఓ కె.మాధవి తెలిపారు. గోడిలంకలో సర్పంచ్ రుద్రరాజు పవిత్ర అధ్యక్షతన జరిగిన రీ సర్వే గ్రామసభకు ఆర్డీఓ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ, సర్వే డీటీ, మండల సర్వేయర్, గ్రామ సర్వే అధికారి, వీఆర్‌ఓతో కూడిన బృందాలు భూములను రీ సర్వే చేస్తాయన్నారు. సరిహద్దులు నిర్ధారించాక ఆ భూములను ఆన్‌లైన్ చేస్తారన్నారు. ముందుగా రైతులకు నోటీసులు జారీ చేసి, వారి సమక్షంలో కొలతలు తీస్తారని చెప్పారు. మొగళ్లమూరులో సర్పంచ్ రాయుడు విష్ణు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు రీ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, డీటీ సుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ కృష్ణకుమారి, ఆర్ఐ రత్నం, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

స్టేట్‌హుడ్ డిమాండ్ నెరవేర్చాలి

యానాం: పుదుచ్చేరికి రాష్ట్ర హోదా లేకపోవడంతో ప్రభుత్వం కీలకమైన ఏ నిర్ణయాలు తీసుకోలేకపోతుందని, దీనికి పరిష్కారం స్టేట్‌హుడ్ డిమాండ్ నెరవేర్చడమేనని సీఎం రంగసామి అన్నారు. మంగళవారం జరిగిన పరిశ్రమల పెట్టుబడిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేట్‌హుడ్‌పై ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అశోక్‌బాబు ప్రస్తావించారు. పరిశ్రమల స్థాపన ఆలస్యం కావడానికి పరిపాలనా వ్యవస్థే కారణమన్నారు. స్టేట్‌హుడ్ రాకపోతే భవిష్యత్తులో ప్రభుత్వాలు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటాయన్నారు.

సంరక్షకులకు భద్రత ఏదీ?

- అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లను సంరక్షిస్తున్న సిబ్బంది
- రేయింబవళ్లు తీరంలో గస్తీ
- చాలీచాలని ఆదాయంతో చాకిరీ
- వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్


గచ్చకాయలపోర తీరంలో తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రం వద్ద రక్షణ సిబ్బంది


ఎస్.యానాం వద్ద ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలో వదులుతున్న రక్షణ సిబ్బంది

కాట్రేనికోన: సముద్ర జలాల్లో అంతరిస్తున్న జీవ జాతుల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఉన్నాయి. హిందూ మహా సముద్ర జలాల నుంచి సంతానోత్పత్తి కోసం వేలాది మైళ్లు సుదీర్ఘంగా ప్రయాణించి బంగాళాఖాతం సముద్ర జలాలకు చేరుతాయి. ఆడ, మగ తాబేళ్లు జంటలుగా వేలాది సంఖ్యలో బంగాళాఖాతం సముద్ర జలాలకు నవంబర్ నాటికి చేరుకుని జట్లు కడతాయి. సంతానోత్పత్తి కోసం ప్రయాణిస్తున్న సమయంలో చేపల వలల్లో చిక్కుకుని, ప్లాస్టిక్, చమురు సంస్థల వ్యర్థాలతో కొన్ని తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. అంతరిస్తున్న ఈ తాబేళ్ల రక్షణ కోసం అటవీ శాఖ వైల్డ్ లైఫ్ ఫారెస్టు విభాగం ఆధ్వర్యంలో రక్షణ, పునరుత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో పని చేస్తున్న తాబేళ్ల రక్షణ సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల్లో వాసాలతిప్ప, ఎస్.యానాం, గచ్చకాయలపోర, నీళ్లరేవు, సాక్రమెంట్ లైట్‌హౌస్ ప్రాంతాల్లో ఈ తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రాల్లో 20 మంది రక్షణ సిబ్బంది పని చేస్తున్నారు. తాబేళ్లు గుడ్లు పెట్టిన అనంతరం సిబ్బంది రేయింబవళ్లు తేడా లేకుండా సముద్ర తీరం వెంబడి కిలోమీటర్ల దూరం నడిచివెళ్లి, గుడ్లు సేకరించి హేచరీల్లో ఉంచుతారు. గుడ్లు పెట్టిన 45 రోజుల తర్వాత పిల్లలు బయటకు వస్తాయి. తాబేళ్ల గుడ్లను పక్షులు, కాకులు, నక్కలు, కుక్కలు, పిల్లుల నుంచి రక్షిస్తూ, పునరుత్పత్తి కేంద్రాల వద్దే సిబ్బంది కాపలా కాస్తుంటారు.

ఏళ్ల తరబడి..

సుమారు 14 ఏళ్ల నుంచి తీరం వెంబడి తాబేళ్లను, వాటి గుడ్లను రక్షిస్తూ, లక్షలాది పిల్లలను సురక్షితంగా సముద్ర జలాల్లో వదులుతున్నారు. ఏటా జనవరి నుంచి మే వరకు ఐదు నెలలు పాటు అటవీ శాఖ సిబ్బందితో పని చేయించుకుంటుంది. తాబేళ్లు ఎప్పుడు ఒడ్డుకొచ్చి గుడ్లు పెట్టినా, వాటిని కనిపెట్టుకుని పునరుత్పత్తి కేంద్రాలకు తీసుకురావాల్సి ఉంటుంది. ప్రతి వ్యక్తికి నెలకు 26 రోజులు పని దినాలు కల్పిస్తూ, రోజుకు రూ.385 చొప్పున నెలకు రూ.10,010 చెల్లిస్తున్నారు. భోజన వసతికి రోజుకు రెండు పూటలకు నలుగురు సిబ్బందికి రూ.420 చెల్లిస్తున్నారు.

తప్పని ఆర్థిక ఇబ్బందులు

అటవీ శాఖపై ఆధారపడి జీవిస్తున్న తమకు పెరిగిన నిత్యావసర ధరలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనికి తగిన వేతనం లేక, జీవనోపాధి కష్టతరమైందని అంటున్నారు. సముద్ర తీరం వెంబడి దోమలు దాడిని భరిస్తూ, రక్షణ కేంద్రాల్లో తాబేళ్ల గుడ్లను రక్షిస్తున్నామని, తమకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో పనిచేస్తున్న రక్షణ సిబ్బందిని తమ శాఖ పరిధిలో ఇతర పనులకు కేటాయించి, ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కనీస వేతనాలు చెల్లించండి

ఏటా జనవరి నుంచి మే వరకు ఐదు నెలలు మాత్రమే పని కల్పిస్తున్నారు. నెలకు 26 రోజుల చొప్పున రోజుకు రూ.385 చెల్లిస్తున్నారు. 24 గంటలూ సముద్ర తీరం వెంబడి గస్తీ కాయడం, రాత్రి, పగలు తాబేళ్లు ఎప్పుడు గుడ్లు పెట్టినా సురక్షితంగా తీసుకొచ్చి, పునరుత్పత్తి కేంద్రాలకు చేరుస్తున్నాం. మాకు కనీస వేతనాలు చెల్లించండి.

– పాలెపు అప్పలస్వామి, తాబేళ్ల రక్షణ కేంద్రం సిబ్బంది

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆలివ్ రిడ్లే తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రాల్లో పని చేస్తున్న మాకు పూర్తి స్థాయిలో పని కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలి. ఏడాదికి ఐదు నెలలు మాత్రమే పని కల్పిస్తున్నారు. రోజుకు రూ.385 చెల్లిస్తూ, 24 గంటలూ పని చేయించుకుంటున్నారు. అటవీ శాఖపై ఆధారపడి జీవిస్తున్న మేము జీవనోపాధిని కోల్పోతున్నాం.

– పాలెపు ధర్మారావు, తాబేళ్ల రక్షణ కేంద్రం సిబ్బంది

గడువులోగా చెల్లిస్తే వడ్డీ రాయితీ

మున్సిపల్ కమిషనర్ రాజు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఈ నెల 31వ తేదీ లోపు బకాయిల్లేకుండా పూర్తిగా చెల్లిస్తే, వారికి వడ్డీలో 50 శాతం రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మంగళవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గడువు లోపు సమీపంలోని వార్డు సచివాలయంలో లేదా మున్సిపల్ కార్యాలయంలో చెల్లించవచ్చని చెప్పారు. పన్నులను సకాలంలో, బకాయిలు లేకుండా చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. సెలవు దినాల్లోనూ పన్నులు చెల్లించవచ్చని, అందుకు తమ మున్సిపల్ రెవెన్యూ, వార్డు సచివాలయాల సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

దేవస్థాన ఉత్సవ కమిటీ నియామకం

అమలాపురం టౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి ఉత్సవ కమిటీని నియమిస్తూ రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ నుంచి ఉత్తర్వులు అందినట్టు దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్, ఎనిమిది మంది సభ్యులుగా నియమితులైనట్టు ఓ ప్రకటన విడుదల చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా జంగా అబ్బాయి వెంకన్న, కమిటీ సభ్యులుగా దున్నాల వెంకటస్వామి నాయుడు, గన్నవరపు సూర్యభాస్కరరావు, గోకరకొండ లక్ష్మణరావు, మోకా వెంకటసుబ్బారావు, దున్నాల దుర్గారావు, కొమ్ముల ఆదినారాయణ, కుంచే వెంకన్నబాబు, పెద్దింటి బాలవెంకట లక్ష్మీనరసింహాచారి(అర్చకుడు)ను నియమితులయ్యారు.

సముద్రంలోకి తాబేలు పిల్లల విడుదల


హోప్ ఐలాండ్ దీవిలో తాబేలు పిల్లలను వదులుతున్న విద్యార్థులు, సిబ్బంది

తాళ్లరేవు: అటవీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం 122 తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు. కోరంగి పంచాయతీ హోప్ ఐలాండ్ దీవిలోని తాబేళ్ల సంరక్షణ కేంద్రంలోని పిల్లలను వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి అటవీ శాఖ సిబ్బంది సముద్రంలోకి వదిలారు. పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడే తాబేళ్ల ప్రాముఖ్యాన్ని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ విద్యార్థులకు వివరించారు.

హౌసింగ్ లోన్‌కు టీడీపీ కార్డు ఉండాలా?

- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యుడి ప్రశ్న
- ఎస్సీ వర్గీకరణ నిర్ణయంపై పలువురు ఎంపీటీసీ సభ్యుల వాకౌట్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: తమ గ్రామంలో హౌసింగ్ లోన్లు మంజూరు కావాలంటే టీడీపీ సభ్యత్వ కార్డు ఉండాలని ఆ పార్టీ నాయకుడొకరు ప్రచారం చేసుకుంటున్నారని గోపవరం ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నించారు. అలాంటి నిబంధన ఉందా అంటూ హౌసింగ్ అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంగేటి వీరఅచ్యుత జానకి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఏడుకొండలు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు మాట్లాడుతూ, ఆపద వస్తే వైద్యం చేయటానికి ఉప్పలగుప్తం పీహెచ్‌సీలో ఒకే ఒక్క స్టాఫ్ నర్సు మాత్రమే ఉన్నారని, ప్రజల ఇబ్బందులను తీర్చడంలో ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో అధికారులు లేకపోతే.. ఎంపీటీసీలను, సర్పంచ్‌లను ఎందుకు పిలుస్తున్నారంటూ పలువురు ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను విన్నవించేందుకు అధికారులు అందుబాటులో ఉండడం లేదని అసంతృప్తి చెందారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఏకపక్ష నిర్ణయాన్ని తీసుకుందని, ఇది సరైనది కాదంటూ పలువురు ఎంపీటీసీ సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీలు సాదే శ్రీనివాసరావు, నడింపల్లి విజయలక్ష్మి, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, జిన్నూరి వెంకటేశ్వరరావు, కుంచే బుల్లియ్య, యర్రంశెట్టి రామచంద్రరావు, బద్రిబాబ్జి, పెయ్యల రాజ్‌కుమార్, జొన్నాడ శ్రీదుర్గ, వాకపల్లి ఈశ్వరి, చిక్కం పెదబాబు, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, వంగా గిరిజాకుమారి, చిక్కం త్రినాథ్, కాట్రు ధనలక్ష్మి, అంగాని ధనలక్ష్మి, వరసాల వెంకటలక్ష్మి, తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, సలాది సురేఖారాణి, షేక్ అహ్మద్ ఆలీషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆక్వా జోన్‌పై గ్రామ సభలు

అల్లవరం: వ్యవసాయానికి అనుకూలంగా లేని భూముల్లో ఆక్వా చెరువులు తవ్వుకోవడానికి గ్రామ స్థాయి కమిటీల ద్వారా రీ సర్వే చేసినట్టు మత్స్య శాఖాధికారి అశ్విని తెలిపారు. గుడాల సచివాలయంలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు అధ్యక్షతన మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ అశ్విని మాట్లాడుతూ, 2018 ఏప్రిల్ 20న విడుదలైన జీఓ నం.16 మేరకు అల్లవరం మండలంలోని 19 గ్రామాల్లో ఆక్వా జోనేషన్‌పై రీ సర్వే చేసినట్టు వివరించారు. 2018 నుంచి 2023 వరకు చెరువులకు సంబంధించి రెవెన్యూ సర్వే నంబర్లు ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చి, రెండుసార్లు ఆక్వా గెజిట్‌ను ప్రకటించారన్నారు. ఆక్వా జోన్ గెజిట్‌లో నమోదు కాని చెరువులు, వ్యవసాయానికి అనుకూలం కాని వాటిపై రీ సర్వే చేశామన్నారు. ఈ వివరాలను పంచాయతీల్లో ప్రచురించినట్టు తెలిపారు. ఈ నెల 29 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, అభ్యంతరాలుంటే గ్రామ సభ దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సభల షెడ్యూల్

26న గుండెపూడి, సామంతకుర్రు, మొగళ్లమూరు, తుమ్మలపల్లి
27న కోడూరుపాడు, రెల్లుగడ్డ, తూర్పులంక
28న గోడి, గోడిలంక, బెండమూర్లంక, ఓడలరేవు
29న కొమరగిరిపట్నం, ఎంట్రుకోన, బోడసకుర్రు

కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పట్టణ సీఐ వీరబాబు


విద్యార్థులు, ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సైలు

అమలాపురం టౌన్: ప్రతి వాహన చోదకుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగస్వాములు కావాలని పట్టణ సీఐ పి.వీరబాబు అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద మెయిన్ రోడ్డుపై వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ద్విచక్ర వాహన చోదకులతో మంగళవారం ఉదయం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వీరబాబు మాట్లాడుతూ, ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అతి వేగాన్ని విడనాడి, నిదానంగా వాహనాలను నడపాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా విద్యార్థులు మోటార్ సైకిళ్లను నడపరాదన్నారు. అవగాహన లేని డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాలకు కారణమై కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు. రోడ్డు ప్రమాదాల తీరును, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు, పట్టణ ఎస్సై ఎస్‌వీ కిషోర్‌బాబు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

అల్లవరం: పోషణ్ భీ, పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా గోడిలంక ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీఓ విజయశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మంగళవారం జరిగిన తొలి రోజు శిక్షణలో సీడీపీఓ మాట్లాడుతూ, పోషణతో కూడిన విద్యను ప్రీ స్కూల్ పిల్లలకు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదర్శ శీల, నవచేతన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సీహెచ్ వెంకటలక్ష్మి, ఉన్నీసా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

అమలాపురం రూరల్: తల్లిపాలు అమృతం వంటిదని, బరువు తక్కువ పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నపూర్ణేశ్వరి, విజయకుమారి, మహేశ్వరి అన్నారు. జనుపల్లి ఉన్నత పాఠశాలలో పోషణ్ భీ, పఢాయి భీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం లభిస్తుందని, క్రమం తప్పకుండా వారికి అందించాలని కార్యకర్తలకు సూచించారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు పల్లిపాలెంలో మంగళవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక రెల్లు గడ్డి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని సర్వం కాలిపోవడంతో పట్టా ఆదియ్య, పట్టా సురేంద్ర కుటుంబాలు కట్టు బట్టలతో వీధిన పడ్డారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం సుమారు రూ.మూడు లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే రాజోలు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. పలువురు స్థానికులు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

వేధింపులకు నిరసనగా ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా


డిపోలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లపై వేధింపులకు పాల్పడుతున్నారంటూ యునైటెడ్ వర్కర్స్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆందోళనలో భాగంగా 36వ రోజు గేట్ మీటింగ్‌లో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వంగా గణపతిరావు మాట్లాడుతూ, డిపోలో 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమంగా సస్పెండ్ అయిన డ్రైవర్ నారాయణను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజోలు నుంచి వచ్చిన డ్రైవర్ కేజీ రావును డ్రైవర్ కం కండక్టర్ డ్యూటీకి వెళ్లాలని వేధించడం మానుకోవాలని చెప్పారు. డిపోలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యం ఘోరంగా విఫలమైందన్నారు. వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి, వేసవిలో కార్మికులకు, ప్రయాణికులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు వసతి గదులు కేటాయించాలని సంఘ జిల్లా ఉప కార్యదర్శి రంగప్రసాద్ కోరారు. బేషరతుగా ఇద్దరు డ్రైవర్లను డ్యూటీలోకి తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు హౌలియా, ప్రధాన కార్యదర్శి పి.మణిరాజు డిమాండ్ చేశారు.

రిజర్వేషన్లు ఖరారయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు

యానాం: మాహే, యానాం, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో మున్సిపాలిటీ, కమ్యూన్ పంచాయతీల ఎన్నికలు పదేళ్లుగా నిర్వహించడం లేదని, తక్షణం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంగళవారం అసెంబ్లీలో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే ఎం.శివశంకర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనికి సీఎం రంగసామి జవాబిస్తూ, ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కేంద్రప్రభుత్వం నుంచి స్థానిక సంస్థలకు నిధులు రావడం లేదన్నారు. ఓబీసీ కులాలకు రిజర్వేషన్ల కల్పనపై ప్రభుత్వం కమిషన్ వేసిందని, దాని సిఫార్సుల ఆధారంగా రిజర్వేషన్లు కల్పించి, ఎన్నికలు జరుపుతామన్నారు.

కొనసాగుతున్న సమ్మె

యానాం: నేషనల్ రూరల్ హెల్త్‌మిషన్ ద్వారా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ డిమాండ్ల సాధనకు యానాం ప్రభుత్వాస్పత్రిలో చేస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఎన్నో ఏళ్లుగా తమ వేతనాలు పెంచాలని, పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా అన్ని సదుపాయాలు కల్పించాలన్న తదితర డిమాండ్లపై తాము నిరవధిక సమ్మెకు దిగినట్లు వారు తెలిపారు.

రాజకీయ ప్రతినిధులతో సమావేశం

యానాం: వచ్చే ఏడాది పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించారు. పుదుచ్చేరిలో రెడ్డియార్‌పాలెం ఎన్నికల శాఖ కార్యాలయంలో చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పి.జవహర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై పలు సూచనలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ఎలక్టోరల్ రోల్‌ను పునః పరిశీలించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయం... ఆరోగ్యం పదిలం


ఇరుసుమండలో రైతులకు కిట్లను ఇస్తున్న ఏడీఓ

అంబాజీపేట: సేంద్రియ విధానంలో సాగు చేసే పంటలు మానవాళికి ఎంతో మేలు చేసి ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుతాయని పి.గన్నవరం ఏడీఏ రామమోహనరావు అన్నారు. ఇరుసుమండ రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నాచురల్ ఫార్మింగ్) విభాగం ద్వారా విత్తనాలను 120 మంది రైతులకు ఏపీసీఎన్ఎఫ్ వ్యవసాయాధికారి కె.శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం పంపిణీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులకు దాళ్వా పంట అనంతరం భూమి పోషకాల పెంపుదలకు, పశువులకు నాణ్యమైన మేత కోసం పీఎండీఎస్ (ప్రైమాన్‌సూన్ డ్రై సోయింగ్) 20 రకాల విత్తనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రూ.450 విలువ చేసే 20 రకాల విత్తనాలను ఆరు కిలోల కిట్‌గా చేసి రైతులకు ఇస్తున్నామన్నారు. వక్కలంక, ముక్కామల, ఇరుసుమండ గ్రామాల్లో 120 మందికి కిట్లను అందించామన్నారు.

సారాపై ప్రజలకు అవగాహన


కామనగరువులో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

అమలాపురం రూరల్: సారా రహిత సమాజ నిర్మాణానికి నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కామనగరువు, రెడ్డిపల్లి, తండవపల్లి గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు, సేవించడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ సచివాలయ ఉద్యోగులు, స్కూల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అమలాపురం ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ, ఎస్సై పి.బాలాజీ అవగాహన కల్పించారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న అంబాజీపేటకు చెందిన టి.సుబ్రహ్మణ్యం, అమలాపురం మండలం బండారులంకకు చెందిన దొమ్మేటి గోపాలకృష్ణపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.